శనగ రైతుకు తప్పని బెంగ

- రబీ మొదలైనప్పటికీ ప్రారంభం కాని సబ్సిడీ శనగ పంపిణీ
- అధికారులు ప్రతిపాదనలు పంపినా పట్టించుకోని సర్కార్
- ఆర్థిక మంత్రి ఇలాకాలో అన్నదాతకు తప్పని అవస్థలు


ఉరవకొండ శివార్లో శనగ విత్తనం విత్తేందుకు పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు

ఉరవకొండ: జిల్లాలోనే అత్యధికంగా పప్పుశనగ సాగయ్యే ఉరవకొండ నియోజకవర్గంలో శనగ విత్తనం అందకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఉరవకొండ నియోజకవర్గంలో అత్యధికంగా నల్లరేగడి భూములు ఉన్నాయి. దాదాపు 50వేల హెక్టార్లలో రబీలో శనగ సాగు అవుతుంది. ఈ పంటను ఉరవకొండతో పాటు వజ్రకరూరు, విడపనకల్లు, బెళుగుప్ప, రాయదుర్గం, డి.హిరేహాళ్, కణేకల్లు మండలాల రైతులు అధిక విస్తీర్ణంలో సాగు చేస్తారు. సీజన్ మొదలైనా విత్తనం అందకపోవడంతో రైతులు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

10 వేల క్వింటాళ్ల విత్తనాలు అవసరం..

ఉరవకొండ, రాయదుర్గం నియోజకవర్గాలకు 55,114 హెక్టార్లలో పంట సాగవుతుందని అంచనా. ఇందుకోసం దాదాపు 10 వేల క్వింటాళ్ల శనగ విత్తనం అవసరం అవుతుంది. దీనికి సంబంధించి అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఇటీవల కురిసిన వర్షాలకు భూమిలో తేమ శాతం అనుకులంగా ఉండటంతో అదును దాటే లోగా శనగ విత్తనం వేసేందుకు రైతులు ఉత్సాహం చూపుతున్నారు. దీనికి తగ్గట్టు ప్రభుత్వం విత్తన ఎర్పాట్లు చేయకపోవడంతో రైతులు అప్పులు చేసి కర్ణాటకతో పాటు ఇతర ప్రాంతాలకు వెళ్లి బహిరంగ మార్కెట్లో క్వింటా విత్తనాన్ని రూ.6 వేలు వెచ్చించి విత్తనాన్ని కొనుగోలు చేస్తున్నారు.

ఉరవకొండ, రాయదుర్గం నియోజకవర్గాల్లో పప్పుశనగ సాగు వివరాలు

మండలం పేరు	సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)
ఉరవకొండ	12,199
వజ్రకరూరు	12,477
విడపనకల్లు	10,486
బెళుగుప్ప	6,549
డి.హీరేహాళ్	3,490
కణేకల్లు	9,923
మొత్తం	55,114

విత్తన పంపిణీపై దృష్టి పెట్టాలి



రబీ సీజన్ ప్రారంభం అయినా శనగ విత్తనం పంపిణీ చేయక పోవడంతో రైతులు ఆందోళనలో ఉన్నారు. మంత్రి కేశవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే అత్యధికంగా శనగ పంట సాగవుతోంది. దీన్ని గమనించి ఇప్పటికైనా మంత్రి కేశవ్ సబ్సిడీ శనగ విత్తనాలు అందించేందుకు కృషి చేయాలి.

– రంగారెడ్డి, సీపీఎం నాయకులు, ఉరవకొండ

విత్తనాలు అందించడంలో విఫలం



రైతులకు అవసరమయ్యే సబ్సిడీ విత్తనాలు, ఎరువులు అందించడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందింది. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించకుండా నిర్లక్ష్యం చేస్తోంది. నియోజకవర్గంలో శనగ సాగువిస్తీర్ణం ఎక్కువ ఉన్నా ఇప్పటి వరకూ విత్తనాలు అందించలేదు.

– చంద్రాయుడు, సీపీఐ మండల కార్యదర్శి, విడపనకల్లు

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం

సబ్సిడీ శనగ విత్తనం కోసం ఇప్పటికే ఉరవకొండ వ్యవసాయ శాఖ డివిజన్ నుంచి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. వారం రోజుల్లో సమస్య పరిష్కారమయ్యే అవకాశం ఉంది. ఈవిషయంలో రైతులెవరూ ఆందోళన చెందవద్దు.

– సత్యనారాయణ, ఏడీఏ, ఉరవకొండ

క్లుప్తంగా

దివ్యాంగ విద్యార్థులకు నేడు వైద్య పరీక్షలు

శెట్టూరు: స్థానిక మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 9న దివ్యాంగ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎంఈఓలు శ్రీధర్, వాణిదేవి ఒక ప్రకటనలో తెలిపారు. 0–18 సంవత్సరాలు వయస్సు ఉన్న పిల్లలకు మెడికల్ క్యాంపు నిర్వహిస్తామన్నారు. ఆధార్, రేషన్ కార్డు, సదరమ్ సర్టిఫికెట్, యూడీఐడీ నంబర్, 2 పాస్‌ఫొటోలు తీసుకుని మధ్యాహ్నం 1 గంటకు పాఠశాలలో జరిగే మెడికల్ క్యాంపునకు హాజరుకావాలన్నారు.

రాకేష్ కిశోర్‌పై చర్యలు తీసుకోవాలి


నిరసన తెలుపుతున్న ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు

కళ్యాణదుర్గం: సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయిపై చెప్పుతో దాడికి యత్నించిన లాయర్ రాకేష్ కిశోర్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ జేఏసీ తాలూకా అధ్యక్షుడు చెలిమప్ప మాట్లాడుతూ మతోన్మాదాన్ని వ్యతిరేకించే వారిపై దాడులు పెరిగిపోతున్నాయనడానికి ఇదే నిదర్శనమన్నారు. లాయర్ రాకేష్ కిశోర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ మండల అధ్యక్షుడు మధు, అనీల్, శ్రీరాములు, తిప్పేస్వామి, నాగార్జున, గంగాధర్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

దుర్గం ఉపాధ్యాయుడికి ఉత్తమ అవార్డు


అవార్డు అందుకుంటున్న చల్లా కిరణ్ చౌదరి

కళ్యాణదుర్గం: పట్టణంలోని స్థానిక ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న చల్లా కిరణ్ చౌదరికి ఉత్తమ అవార్డు దక్కింది. ఈనెల 7న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఏబీసీఎఫ్, యునెస్కో సంయుక్త ఆధ్వర్యంలో నేషనల్ టీచర్స్ డే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏబీసీఎఫ్ జాతీయ అధ్యక్షులు గద్దపాటి విజయ్‌రాజు నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయ వృత్తికి, క్రీడలకు అందించిన సేవలకు గానూ చల్లా కిరణ్ చౌదరికి నేషనల్ బెస్ట్ టీచర్ 2025 అవార్డు అందించారు.

పౌష్టికాహారం తప్పనిసరి


బాలింతలకు సూచనలిస్తున్న సీడీపీఓ పద్మావతి

శెట్టూరు: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఎంపీడీఓ జిలానీబాషా, ఈఓఆర్డీ రఘురామరావులతో సీడీపీఓ పద్మావతి మాట్లాడారు. చిన్నారుల పౌష్టికాహారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. పిల్లల్ని పెంచడంలో తల్లిదండ్రులు ఇద్దరూ సమాన బాధ్యత తీసుకోవాలని సూచించారు.

ఉచిత పండ్ల మొక్కలను సద్వినియోగం చేసుకోండి

కుందుర్పి: స్థానిక కుసుమగిరి రైతు సంఘం ఆధ్వర్యంలో అందించే ఉచిత మొక్కలను సద్వినియోగం చేసుకోవాలని కుసుమగిరి రైతు సంఘం నాయకులు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రం సమీపంలోని ఆరు బయల్లో పండ్ల మొక్కలను అందుబాటులో ఉంచామన్నారు. కావాల్సిన రైతులు తమను సంప్రదించాలని సూచించారు. ఎకరాకు 80 మామిడి, 40 సుగాని, 18 ఎర్రచందనం, 5 కొబ్బరి మొక్కలు అందిస్తామన్నారు.

ఘనంగా భారత యువసేన దినోత్సవం


భారతదేశం నమూనాలో విద్యార్థులు


జెండాలతో విద్యార్థుల విన్యాసాలు

కళ్యాణదుర్గం: మున్సిపాలిటీ పరిధిలోని దొడగట్ట ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం భారత యువసేన దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్ విజయంతో మనదేశ కీర్తి పెరిగిందన్నారు. అనంతరం విద్యార్థులు భారతదేశ పటం నమూనాలో విద్యార్థులు నిలబడి గౌరవ సూచనంగా సెల్యూట్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజన్న, రమేష్, మనోహర్, విజయ్ కృష్ణ, జయలక్ష్మి, నాగలతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

కుందుర్పి: స్థానిక రాధాస్వామి ప్రైవేటు పాఠశాలలో బుధవారం భారత వైమానిక దళ దినోత్సవాన్ని నిర్వహించారు. హెచ్ఎం సుశీల ఆధ్వర్యంలో విద్యార్థులు వైమానికి దళానికి సంబంధించిన చేసిన విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

సింగానహళ్లిలో చోరీ


దొంగతనం జరిగిన ఇంట్లో పరిశీలిస్తున్న పోలీసులు

బొమ్మనహాళ్: సింగానహళ్లిలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చిన్న వండ్రప్పకు ఆదివారం సాయంత్రం గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ఆయన్ను బెంగళూరుకు తీసుకెళ్లారు. ఆ సమయంలో ఇంట్లో ఆయన పెద్దల్లుడు పరమేష్ మాత్రమే ఉన్నాడు. సోమవారం ఉదయం లేచి తన సొంత ఊరు గోవిందవాడకు వెళ్లిపోయాడు. మంగళవారం పరమేష్ తిరిగి ఇంటికి వచ్చినప్పుడు తలుపులు తెరిచి ఉండడంతో అనుమానం కలిగింది. లోపలికెళ్లి చూడగా వస్తువులు చిందరవందరగా పడి ఉండటంతో చోరీ జరిగిందని నిర్ధారణకు వచ్చాడు. వెంటనే స్థానికులతో కలిసి పోలీసులకు సమాచారం అందించాడు. ఎస్ఐ నబీరసూల్ తన సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీముల సహాయంతో ఆధారాలు సేకరిస్తున్నారు. ఇంట్లో దాదాపు 20 తులాల బంగారం, రూ.20 వేల నగదు చోరీకి గురయ్యిందని అంచనా వేస్తున్నారు. అయితే ఆస్పత్రిలో ఉన్న ఇంటి యజమాని చిన్న వండ్రప్ప వస్తే తప్ప ఎంత పోయిందనేది స్పష్టత రాదు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జీఎస్టీ సంస్కరణలతో పేదలకు లబ్ధి



సమావేశంలో అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, కమిషనర్ దివాకర్‌రెడ్డి

రాయదుర్గంటౌన్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీ సంస్కరణలతో పేద, మధ్య తరగతి ప్రజలకు లబ్ధి చేకూరుందని మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్ కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ జీఎస్టీలో సంస్కరణ ఫలితంగా ప్రజల కొనుగోలు శక్తి పెరగడమే కాక దేశ ఆర్థిక వ్యవస్థ కూడా బలపడుతుందన్నారు. అనంతరం వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీల్లో విజేతలకు ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ సురేష్, ఏఈ నరసింహులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

2.17 లక్షల యూనిట్ల జల విద్యుత్ తయారీ


జల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్న టర్బైన్ ఇదే

కూడేరు: పెన్నహోబిళం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్(పీఏబీఆర్) వద్ద ఏర్పాటైన ఏపీ జెన్‌కో జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో బుధవారం నాటికి 2.17 లక్షల యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసినట్లు ఏపీ జెన్‌కో జేఈ కిరణ్ తెలిపారు. రెండు టర్బైన్లు ఉండగా ప్రస్తుతం ఒక టర్బైన్‌లో మాత్రమే విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. ఒక టర్బైన్‌లో గంటకు 3 వేల యూనిట్ల చొప్పున రోజుకు 72,500 యూనిట్లు ఉత్పత్తి అవుతోందన్నారు. రెండేళ్ల తర్వాత ఈ నెల 5 నుంచి విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. ఇరిగేషన్ అధికారులు ఎక్కువ నీటిని విడుదల చేస్తే రెండవ టర్బైన్‌లో కూడా విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభిస్తామన్నారు. ఇక్కడ తయారైన విద్యుత్‌ను కళ్యాణదుర్గం–తాటిచెర్ల విద్యుత్ లైన్‌కు అనుసంధానం చేస్తున్నట్లు తెలిపారు. జల విద్యుత్ ఉత్పత్తికి రోజుకు సుమారు 585 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఇరిగేషన్ జేఈఈ లక్ష్మీదేవి తెలిపారు.

సంక్షిప్త సమాచారం

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి


ఊరేగింపులో పాల్గొన్న గ్రామస్తులు

ఉరవకొండ రూరల్: ఆమిద్యాల గ్రామంలో వాల్మీకి జయంతిని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. మహర్షి వాల్మీకి విగ్రహాన్ని వివిధ పుష్పాలతో అలంకరించిన వాహనంపై ఉంచి డప్పు వాయిద్యాల నడుమ ఊరేగించారు.

విరబూసిన బ్రహ్మకమలాలు



కుందుర్పి: మండల కేంద్రంలోని ఇబ్రహీం ఇంటి వద్ద బుధవారం బ్రహ్మ కమలాలు వికసించాయి. మామూలుగా మొక్కకు ఒకటి లేదా రెండు పుష్పాలు వికసిస్తాయి. అయితే ఇబ్రహీం ఇంటి వద్ద ఉన్న మొక్క ఏకంగా 10 పుష్పాలు విరబూశాయి. చూసేందుకు స్థానికులు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజలు చేశారు.

సీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

వజ్రకరూరు: కొనకొండ్ల సీహెచ్‌సీని ఏపీఎంఎస్ఐడీసీ ఎస్ఈ చిరంజీవి బుధవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆస్పత్రి ప్రాంగణాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఆస్పత్రిలో ప్రహరీ, రోడ్డు నిర్మాణం చేపట్టాల్సిం ఉందని, ఆ పనులు డిసెంబర్‌లోపు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ నాయుడు, ఎలక్ట్రికల్ డీఈ జయరామిరెడ్డి, సివిల్ డీఈ నవీన్, వైద్య సిబ్బంది ఉన్నారు.

నేడు మండల సమావేశం

కణేకల్లు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చంద్రమౌళి ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీలతోపాటు సర్పంచులు, అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అధికారులు గైర్హాజరైతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

చౌక దుకాణాల తనిఖీ

బెళుగుప్ప: నరసాపురం, రమనేపల్లి గ్రామాల్లోని చౌకధాన్యపు దుకాణాలను తహసీల్దార్ అనిల్‌కుమార్ వీఆర్ఓ రాజశేఖర్‌తో కలసి బుధవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. దుకాణంలో కేటాయింపులు, బ్యాలెన్స్‌లను పరిశీలించారు. నిత్యావసరాల సరుకుల పంపిణీలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని తహసీల్దార్ డీలర్లను హెచ్చరించారు.

మహిళా రైతులకు అన్ని విధాలా మద్దతు


మాట్లాడుతున్న జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ గంగాధర

బొమ్మనహాళ్: మహిళా రైతుల శక్తికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విధాలా మద్దతు ఇస్తున్నట్లు జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ గంగాధర తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో మహిళా రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘం మహాసభలు ఘనంగా నిర్వహించారు. జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ గంగాధర ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మహిళా రైతులు అభివృద్ధి చెందాలని సూచించారు. ఉత్పత్తి సామర్థ్యాలను పెంపొందించుకునే మార్గాలను అన్వేషించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం గంగన్న, సీసీలు గవిసిద్ద, ఖాజన్న, తిప్పయ్య, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

కూడేరు: ముద్దలాపురం వద్ద బుధవారం అనంతపురం–బళ్లారి ప్రధాన రహదారిపై ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. ఉరవకొండకు చెందిన నూర్ మహమ్మద్ తన తండ్రి వలిబాషాతో కలిసి ద్విచక్ర వాహనంపై అనంతపురం బయలుదేరాడు. ఘటనా స్థలికి రాగానే అదుపు తప్పి రాయి ఎక్కడంతో కింద పడ్డాడు. స్థానికుల సాయంతో కూడేరులోని పీహెచ్‌సీకి చేరుకుని వైద్యం చేయించుకున్నాడు.

హెచ్చెల్సీలో రైతు గల్లంతు


గల్లంతైన రైతు బసవరాజు

కణేకల్లు: మీనహళ్లికి చెందిన రైతు బసవరాజు (32) హెచ్చెల్సీలో ప్రమాదవశాత్తు కాలుజారి పడి గల్లంతయ్యాడు. స్థానికులు, బంధువుల కథనం మేరకు.. బసవరాజుకు హెచ్చెల్సీ పక్కనే పొలం ఉంది. బుధవారం ఉదయం పొలంలో పప్పుశనగ విత్తేందుకు ట్రాక్టర్‌తోపాటు కూలీలను వెంట తీసుకెళ్లాడు. మధ్యాహ్నం 1.30 గంటల వరకు కూలీలతో కలిసి శనగ విత్తనాలు విత్తాడు. ఆ తర్వాత భోజన సమయం కావడంతో తాగేందుకు నీరు తేవడానికి బిందె తీసుకొని హెచ్చెల్సీ వద్దకెళ్లాడు. కాలువలో దిగి బిందెలో నీరు నింపుతున్న సమయంలో పట్టు జారి నీటి ప్రవాహంలో కొట్టుకెళ్లాడు. ఎంతసేపటికీ ఆయన రాకపోవడంతో కూలీలు కాలువ వద్ద కెళ్లగా కొంత దూరంలో బిందె మాత్రం కన్పించింది. కుటుంబ సభ్యులు అతని ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

రోడ్డు పక్కన వ్యర్థాల గుట్టలు


కణేకల్లు రోడ్డు మార్కెట్ యార్డు సమీపంలో గుట్టలుగా పడేసిన వ్యర్థాలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కణేకల్లు రోడ్డు మార్కెట్ యార్డు సమీపంలో రోడ్డు పక్కన వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి ట్రాక్టర్లలో శానిటరీ, గృహ నిర్మాణ వ్యర్థాలు ఇక్కడికి తెచ్చి గుట్టలుగా పడేస్తున్నారు. దుర్వాసన, దోమల బెడదతో పాటు వ్యర్థాలు రోడ్డు అంచు వరకు వస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సమీపంలో అరబిక్ మదరసా కూడా ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు చెబుతున్నారు. అధికారులు పరిశీలించి వ్యర్థాలు పారవేయకుండా తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


విద్యార్థిని శకుంతలతో ఉపాధ్యాయులు

బ్రహ్మసముద్రం: జిల్లా కేంద్రంలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్ 19 విభాగంలో బ్రహ్మసముద్రం జూనియర్ కళాశాల విద్యార్థిని ప్రతిభ కనబరిచింది. జి. శకుంతల 100 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్ దాదాపు మూడు విభాగాల్లో మొదటి స్థానంలో నిలిచింది. దీంతో త్వరలో తూర్పుగోదావరి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ నాగరత్నమ్మ తెలిపారు. పీఈటీ ఇబ్రహీం, ఉపాధ్యాయులు విజయలక్ష్మీ, అర్చన, వెంకట్‌నారాయణ, రవికుమార్ తదితరులు విద్యార్థినిని అభినందించారు.

కోర్టు కానిస్టేబుల్ ప్రసాద్‌కు ఉత్తమ అవార్డు



ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న కానిస్టేబుల్ ప్రసాద్

కణేకల్లు: జాతీయ లోక్ అదాలత్‌లో అత్యధిక కేసుల రాజీ చేయించిన కోర్టు కానిస్టేబుల్ ప్రసాద్‌కు ఉత్తమ అవార్డు లభించింది. సెప్టెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్ జరగ్గా.. కానిస్టేబుల్ ప్రసాద్ ప్రత్యేక చొరవ తీసుకొని అధిక కేసులు రాజీ చేయించి జడ్జీతోపాటు పోలీసు ఉన్నతాధికారుల మన్ననలు పొందారు. జిల్లా వ్యాప్తంగా ఉత్తమ అవార్డులు పొందిన కోర్టు కానిస్టేబుళ్లు నలుగురు ఉండగా... అందులో కణేకల్లుకు చెందిన కానిస్టేబుల్ ప్రసాద్ ఉండటం గమనార్హం. బుధవారం ఎస్పీ జగదీష్ ఆయనకు ఉత్తమ అవార్డు, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు పాల్గొన్నారు. సబ్‌డివిజన్ పరిధిలో అవార్డు సాధించిన కణేకల్లు కోర్టు కానిస్టేబుల్ ప్రసాద్‌ను రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ, కణేకల్లు ఎస్ఐ నాగమధు, ఏఎస్ఐ శంకర్‌రెడ్డి, సిబ్బంది అభినందించారు.

కొలువుదీరిన ‘నేమకల్లు’ ఆలయ పాలకవర్గం


ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన పాలకవర్గ సభ్యులు

బొమ్మనహాళ్: ప్రసిద్ధ నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయానికి పదేళ్ల తర్వాత పాలక మండలి ఏర్పాటైంది. బుధవారం ఉరవకొండ దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ రాణి సమక్షంలో నూతన ధర్మకర్త, సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. గతంలో పాలకవర్గం ఏర్పాటుకు నిర్లక్ష్యం చూపారని విమర్శలు వచ్చాయి. ఆలయ ధర్మకర్తగా శ్రీనాథ్, సభ్యులుగా పద్మ, హనుమేష్, నారాయణప్ప, రామాంజినమ్మ, తిప్పమ్మ, వాణి, హరిజన లక్ష్మి, గొల్ల హనుమంతరెడ్డి, రామాంజినేయులు, వైద్యం అనిల్‌కుమారాచార్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పరమేశ్వర, సింగిల్‌విండో చైర్మన్ కొత్తపల్లి మల్లికార్జున, ఎంపీటీసీ చిక్కణ్ణ, మాజీ ధర్మకర్త కాశీనాథ్, గాలి బసప్ప, శాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపకరణాలకు దివ్యాంగ పిల్లల ఎంపిక


కార్యక్రమంలో పాల్గొన్న పిల్లలు, వారి తల్లిదండ్రులు

ఉరవకొండ రూరల్: ఉరవకొండ నియోజకవర్గంలోని దివ్యాంగ పిల్లలకు అవసరమైన ఉపకరణాల అందజేత కోసం బుధవారం అలిమ్ కో కంపెనీ వారి ఆధ్వర్యంలో ఎస్ఎస్ఏ సమక్షంలో ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని కరిబసవ స్వామి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో కార్యక్రమం జరిగింది. ఐదు మండలాల్లోని 0 – 18 ఏళ్లలోపు పిల్లలకు రోలేటర్, వీల్ ఛైర్, ట్రై సైకిల్, వినికిడి యంత్రాలు, బుద్ధిమాంద్యపు కిట్లు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు. కార్యక్రమంలో ఏపీసీ శైలజ, ఐఈడీ కోఆర్డీనేటర్ కవిత, లావణ్య, ఐదు మండలాల ఎంఈఓలు పాల్గొన్నారు.

మోసానికి నిలువెత్తు రూపం ‘చంద్రబాబు’

- వైఎస్సార్‌సీపీ నేతల మండిపాటు


చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాయదుర్గంటౌన్: నమ్మకద్రోహం, మోసానికి నిలువెత్తు రూపం చంద్రబాబు అని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొల్ల రామాంజనేయులు, వైస్ ఎంపీపీ అరుణ్‌కుమార్ విమర్శించారు. బుధవారం మండలంలోని జుంజురాంపల్లి, మల్కాపురం గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ‘బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ’ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అలవికాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజలను వంచిస్తున్నారని మండిపడ్డారు. పంటలకు సరైన గిట్టుబాటు ధర లభించక, ప్రభుత్వం నుంచి సాయం అందక రైతులు అల్లాడిపోతున్నారన్నారు. హామీలను గాలికొదిలేసి ఆదాయం కోసం ప్రభుత్వం నకిలీ మద్యంతో ప్రజల ప్రాణాలు తీస్తోందన్నారు. 19 నుంచి 59 ఏళ్లలోపు మహిళకు నెలకు రూ.1500 ప్రకారం ఇస్తామన్న ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3 వేలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు 50 ఏళ్లకే పింఛన్‌తో పాటు ఇంకా వందకు పైగా హామీలు అమలు చేయకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నిలువునా మోసం చేస్తున్నారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో సచివాలయాలు, ఆర్బీకేలు, విలేజ్ హెల్త్ సెంటర్లను అందుబాటులోకి తెచ్చి ప్రజలకు ఎన్నో రకాల సేవలను చెంతకే తీసుకొచ్చారన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి.. అర్హులందరికీ లబ్ధి చేకూర్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శివారెడ్డి, ముక్కన్న, భీమప్ప, ఎస్సీ సెల్ కార్యవర్గ సభ్యుడు మహేష్, ఎంపీటీసీ సురేష్‌బాబు, రైతు విభాగం అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, ఎస్టీ సెల్‌కార్యవర్గ సభ్యుడు హరినాయక్, మాజీ ఎంపీపీ కుమారస్వామి, పార్టీ ప్రధాన కార్యదర్శులు గోవర్ధన్, రుద్రముణి, వలంటీర్ విభాగం అధ్యక్షుడు మురారీ, నాయకులు హనుమంతరాయుడు, నగేష్, ఈరణ్ణ, హనుమంతరెడ్డి, గోపాల్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు నేమకల్లు, ఉంతకల్లులో...

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లు, ఉంతకల్లు గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు ‘బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ’ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామాంజినేయులు తెలిపారు.